క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల: మాచర్ల సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ డివిజనల్ కార్యాలయ పరిధిలో బుధవారం విద్యుత్ మరమ్మతులు పురస్కరించుకొని మాచర్ల సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.రామయ్య తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బుధవారం ఉదయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దుర్గి మండలంలోని కోలగుట్ల, అగ్నిగుండాల ఫీడర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ నిమిత్తం ఈ మరమ్మతులు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



రెంటచింతల: సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మరావు అన్నారు. మంగళవారం రెంటచింతల పీహెచ్‌సీ పరిధిలోని మల్లవరం గ్రామ కాలనీలలోని ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఇళ్లలో పాతటైర్లు, కొబ్బరి బొండాలను తొలగించాలని, కూలర్లలోని నీటిని వారానికి ఒకసారి కచ్చితంగా మార్చుకోవాలన్నారు. దోమలను పారదోలడం వలన డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు, బోద వ్యాధి వంటివి దరిచేరవన్నారు. వరుసగా రెండు, మూడు రోజుల పాటు జ్వరం వచ్చిన వెంటనే పీహెచ్‌సీలో రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల ముందున్న సైడ్‌కాలువలలో వారానికి ఒకసారి కిరోసిన్ లేదా బ్లీచింగ్ చల్లుకోవాలని దీంతో ఈగలు, దోమలు నశిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలను వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో శర్మ, సూపర్‌వైజర్ బాషా, ఏఎన్ఎం అంజలి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ భద్రతపై ఎన్నికల అధికారి సమీక్ష



వినుకొండ(నూజెండ్ల): స్వార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి వరదా సుబ్బారావు, ఐదు మండలాల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. పోలీసు, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినుకొండ 99 నియోజకవర్గం కౌంటింగ్ జూన్ 4వ తేదీన నరసరావుపేటలో జరుగనున్న నేపథ్యంలో, అనుసరించాల్సిన విధానాలు, శాంతిభద్రతలు, వంటి అంశాలపై చర్చించారు. ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవలు దృష్టిలో ఉంచుకుని శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా సమస్యాత్మక గ్రామలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే కౌంటింగ్ ముగిసిన తరువాత కూడా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఐదు మండలాల రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలోనే ఉత్తమ సేవలందిస్తున్న మాచర్ల ఆసుపత్రి

డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.రంగారావు



వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు

మాచర్ల: రాష్ట్ర స్థాయిలో పల్నాడు జిల్లాలోని మాచర్ల ప్రభుత్వాసుపత్రి మెరుగైన వైద్య సేవలందించటంలో కీలకపాత్ర వహిస్తూ జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్లు డీసీహెచ్ఎస్ (జిల్లా కో ఆర్డినేటర్ వైద్య సమన్వయ కర్త) డాక్టర్ బి.రంగారావు అన్నారు. మంగళవారం ఆయన మాచర్ల ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని వార్డులు, ల్యాబ్‌తో పాటు ఆపరేషన్ థియేటర్, క్యాజువాలిటీ వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రికి చెందిన సూపరింటెండెంట్ ఉదయభానుతో పాటు వైద్యులందరితో సమీక్ష సమావేశం నిర్వహించారు.

- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన మాచర్ల ప్రాంతంలో పేదలకు మంచి వైద్యమందించేందుకు మాచర్ల ఆసుపత్రిని ఇప్పటికే 50 పడకల ఆసుపత్రిగా చేసి ఉత్తమ సేవలందించటం జరుగుతుందన్నారు.
- 500కుపైగా రోగులు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు.
- జిల్లాలోనే ఆపరేషన్‌ల నిర్వహణ, ఆరోగ్య శ్రీ కింద వైద్య సేవలందించటంలో మొదటి స్థానంలో ఉందన్నారు.
- సమష్టిగా వైద్యులు, సిబ్బంది, ఉద్యోగులు పనిచేయటం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. అందులో భాగంగా మరింత మెరుగైన సేవలకు మాచర్ల ఆసుపత్రిలో త్వరలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామన్నారు.
- ప్రతి ఒక్కరికీ బీపీ చెక్ చేసి గుండెపోటు రాకుండా ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నామన్నారు.
- ఇన్‌పేషెంట్లు ఎక్కువ కావటంతో పడకల సమస్య పెరుగుతుందని, అందుకనుగుణంగా చర్యలు తీసుకోబోతున్నామన్నారు. ఎక్కడా రాజీపడకుండా ఉత్తమ సేవలందించటం జరుగుతుందన్నారు.
- ప్రతి నెలా 150కి పైగా డెలివరీలు చేయటం జరుగుతుందన్నారు. వైద్య సేవలందించే వారు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.
- ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఉదయభానుకు పలు సూచనలు చేశారు. డిజిటల్ విధానాన్ని త్వరలో అమలు పరచి ప్రతి ఒక్కరి కేర్‌షీటు ఆన్‌లైన్‌లో ఉంచి నేరుగా వైద్య సేవలందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.
- మాచర్ల ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు. ఎలక్షన్ కోడ్ వలన ఆలస్యమైందని, త్వరలోనే 100 పడకల ఆసుపత్రి చేస్తామన్నారు.
- చిన్న చిన్న లోపాలుంటే సరిచేసి పూర్తిస్థాయిలో వైద్య సేవలందిస్తామన్నారు. స్థానిక వైద్యులు కేపీ చారి, విజయలక్ష్మి, జయప్రకాష్, లావణ్య, దినేష్, సురేష్, మహేష్, రేవతి, సౌమ్య తదితరులున్నారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు

మండల వ్యవసాయ అధికారి బ్రహ్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో బ్రహ్మారెడ్డి

రెంటచింతల: ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తన శుద్ధి చేయడం వలన చీడపీడల నుంచి పంటలను రక్షించుకుని అధిక దిగుబడులు సాధించడం ద్వారా ఎక్కువ ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పది లీటర్ల నీటిలో 1.5 కిలోల ఉప్పును కలిపి ఎంపిక చేసుకున్న వరి విత్తనాలను పోయగా పైకి తేలిన తాలు విత్తనాలను తీసివేసి నీటి అడుగున మునిగి ఉన్న గట్టి విత్తనాలను నారు పోసుకోవడానికి వాడుకోవాలన్నారు. కిలో వరి విత్తనానికి ఒక లీటరు నీటిలో 2.5 గ్రాముల కార్బండజిమ్ కలిపి 24 గంటలు నానబెట్టిన అనంతరం మరో 20 నుంచి 24 గంటల పాటు మంచినీటిలో విత్తనాన్ని ఉంచి తరువాత నారు మడులలో చల్లుకోవాలన్నారు. విత్తనాల ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. నారుమడిలో ఆకు తినే పురుగులు, ఉల్లికోడు, మొవ్వ పురుగు సోకకుండా ఉండటానికి మొలకెత్తిన విత్తనాన్ని 0.2 శాతం క్లోరిఫ్రేరిఫాస్ ద్రావణంలో నానపెట్టి చల్లుకోవాలన్నారు. ఒక కిలో పత్తి విత్తనాన్ని 8 గ్రాముల ట్రికో డెర్మావిరిడితో, ఒక కేజీ మిరప విత్తనాన్ని 8 నుంచి 10 ఎంఎల్ గౌచో ద్రావణంలో విత్తన శుద్ధి చేయడం మంచిదన్నారు. పత్తి చుట్టూ అంతర పంటగా కంది, మినప, పెసర పంటలను సాగు చేసుకోవడం వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మాగాణి చుట్టూ గట్లుపై కందిని అంతర పంటగా సాగు చేయడం వలన అదనపు ఆదాయం వస్తుందన్నారు. వ్యవసాయ శాఖ కూడా అంతర పంటలను సాగు చేసే రైతులను ప్రోత్సహిస్తుందన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే చర్యలు

పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్



పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

పిడుగురాళ్ల: నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే సీజ్ చేయటం జరుగుతుందని పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ మంగళవారం హెచ్చరించారు. పట్టణంలో నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. ద్విచక్ర వాహనాలు వినియోగించే వారి వద్ద వాహనానికి సంబంధించిన పేపర్లు అన్నీ సక్రమంగా ఉండాలని లేని పక్షంలో కేసులు నమోదు చేయటం జరుగుతుందన్నారు. అలాగే మండలంలోని జానపాడు గ్రామంలో పోలీసు తనిఖీల కార్యక్రమం నిర్వహించటం జరిగిందని, అందులో గ్రామంలో సుమారు 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. వాహనాలకు సంబంధించి ఆర్‌సీ, ఇన్సురెన్స్, పొల్యూషన్ వంటి సర్టిఫికెట్లు చూపించాల్సి ఉంటుందని తెలిపారు. ఎటువంటి పేపర్లు లేని పక్షంలో శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం



కల్యాణోత్సవానికి సిద్ధమైన స్వామి వారు



స్వామి వారిని కల్యాణ మండపానికి తీసుకువస్తున్న మహిళలు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

గురజాల : పల్నాడు యాదాద్రిగా పేరుగాంచిన లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో వేంచేసియున్న లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ముందుగా ప్రభాతసేవ, అభిషేకం, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వార్లను పీఠంపై అధిష్టింపచేసి కల్యాణ మండపానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. స్వామి వారి కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారిని వేకువజాము నుంచి భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పలు చర్యలు చేపట్టారు.
కాగా స్వామి వారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ)దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి, వార్డు కౌన్సిలర్ పోలు వీరారెడ్డి, వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, వైద్యుడు చింతలపూడి అశోక్ బాబు, రైల్వే బోర్డు మెంబర్ కొమ్మినేని రవిశంకర్, తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుండెపోటుతో రెంటాల వీఏఏ మృతి



రెంటచింతల: మండలంలోని రెంటాల గ్రామ వీఏఏగా విధులు నిర్వహిస్తున్న గొట్టం లక్ష్మారెడ్డి(48) మంగళవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. లక్ష్మారెడ్డి స్వగ్రామం మండల పరిధిలోని మిట్టగుడిపాడు. ఆయన వ్యవసాయ శాఖలో ఎంపీఈవోగా, వీఏఏగా మొత్తం 15 సంవత్సరాల పాటు బొల్లాపల్లి, రెంటచింతల మండల వ్యవసాయ సహాయకులుగా పని చేశారు. వ్యవసాయ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన లక్ష్మారెడ్డి సమయపాలన పాటిస్తూ అంకితభావంతో ఉన్నతాధికారులకు, రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మంచి అధికారిగా పేరు పొందారు. లక్ష్మారెడ్డికి భార్య నీలిమ, ఇద్దరు కుమార్తెలు గాయత్రి, స్నేహలత ఉన్నారు. మాచర్ల వ్యవసాయ సహాయ సంచాలకులు జగదీశ్వరరెడ్డి, మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి, వీఏఏలు గొంటు కృష్ణారెడ్డి, పవన్‌కుమార్, సతీష్‌రెడ్డి, రాంబాబు, జగన్, గోపికృష్ణ, ఎస్.వెంకటేశ్వర్లు, కె.శ్రీలత, విజయ్, తిరపతి నాయక్‌లు లక్ష్మారెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి ఆయన అకాలమృతి పట్ల సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాష్ట్ర స్థాయి యోగా న్యాయ నిర్ణేతగా అచ్చంపేట పీడీ



అచ్చంపేట: రాష్ట్ర స్థాయిలో జరిగే యోగాసనాల న్యాయ నిర్ణేతగా పాల్గొనేందుకు తాను అర్హత సాధించినట్లు స్థానిక జెడ్పీ హైస్కూలు ఫిజికల్ డైరెక్టర్(పీడీ) ఆలపాటి సుజాత మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 17, 18, 19 తేదీలలో అనంతపురంలో మినిస్టరీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాసనాల న్యాయ నిర్ణేతల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. అనంతరం జరిగిన న్యాయ నిర్ణేతల అర్హత పరీక్షలో తాను ఎంపికయ్యానన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కళ్యాణి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఉపాధి పనులకు పేర్లు నమోదు

నకరికల్లు: ఉపాధి హామీ పనులను ఎన్నికల నియమావళి పూర్తయిన అనంతరం పూర్తి స్థాయిలో ప్రారంభిస్తామని ఏపీవో సుందరరావు మంగళవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఉపాధి పనులు అన్ని గ్రామాల్లోను చేపట్టలేకపోతున్నామని అన్నారు. ఉపాధి పనుల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు ఆయా గ్రామాల్లోని మేట్‌లను కలసి పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. గ్రూప్‌ల వారీగా పేర్లు నమోదు చేసుకొని సిద్ధంగా ఉంటే త్వరలో పనులు ప్రారంభిస్తామని అన్నారు. జాబ్‌కార్డులు లేనివారు తమ పేర్లు నమోదు చేసుకొని జాబ్ కార్డులు పొందవచ్చని సూచించారు.

రాజీవ్‌గాంధీకి ఘనంగా నివాళి



కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సత్తెనపల్లి: మహాత్మాగాంధీ ఆశయ సాధన అయిన గ్రామీణ ప్రాంతాల స్వయం ప్రతిపత్తికి, భారత రాజ్యాంగానికి 73, 74వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక గ్రామ స్వరాజ్య పాలనకు రాజీవ్‌గాంధీ నాంది పలికారని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, న్యాయవాది దాసరి జ్ఞాన్ రాజ్‌పాల్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. దాసరి జ్ఞాన్ రాజ్‌పాల్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ భారతదేశానికి ఎనలేని సేవలు అందిస్తూ, తీవ్రవాదుల చేతుల్లో ప్రాణాలు కోల్పోయారన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ద్వారా రచించబడిన రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను అమలు పరిచారన్నారు. భారత దేశంలో సైన్స్ టెక్నాలజీ రంగాన్ని అభివృద్ధి చేసి భారతదేశ అభివృద్ధికి ఆయన ఎంతో పాటు పడ్డారని కొనియాడారు. తీవ్రవాదుల చేతిలో అయన అకాల మరణం దేశానికి తీరని లోటని అన్నారు. ముందుగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి, నాయకులు సిద్దెల మోహన్‌రావు, కోట ఆనంద్, మంగళపూరి శంకర్, షేక్ చాన్‌బాషా, గాండ్ల వెంకటేశ్వర్లు, అబ్రహం, వెంకటేశ్వర్లు, కొత్త లక్ష్మయ్య, జెట్టి శేఖర్, మీసాల శంకర్, జిల్లెళ్ల పాల్ రాజ్ ఉన్నారు.

గొడవలు సృష్టిస్తే ఉపేక్షించేది లేదు



వేల్పూరు గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు

అచ్చంపేట: జూన్ 4న వెలువడే ఎన్నికల ఫలితాలు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా ప్రశాంతంగా ఉండాలని, గొడవలు సృష్టించాలని చూస్తే ఉపేక్షించేది లేదని, తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని సత్తెనపల్లి డీఎస్పీ జి.గురునాథబాబు హెచ్చరించారు. మండలంలో సమస్యాత్మకమైన వేల్పూరులో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులకు, గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలు జరిగిన తరువాత గెలుపు, ఓటములు సర్వసాధారణమన్నారు. అందుకు ఎవరెవరినో బాధ్యులను చేస్తూ పరస్పర నిందారోపణలు చేసుకోవడం, గొడవలు, దాడులకు పాల్పడి ప్రజా జీవితానికి విఘాతం కలగజేయడం నేరమన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవలసి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అచ్చంపేట సీఐ షేక్ కరిముల్లాషావలి, క్రోసూరు ఎస్‌హెచ్‌వో షేక్ రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

రంగా కాలనీలో పోలీసుల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు సంధ్యారాణి, సత్యనారాయణ

సత్తెనపల్లి: పట్టణంలోని రంగా కాలనీలో పోలీసులు మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రంగా కాలనీలో విస్తృతంగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పాత నేరస్తులు, అనుమానితులు, స్థానికేతర్ల కదలికలపై ఆరా తీశారు. తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలింగ్ తర్వాత కూడా చెదురుమదురు ఘటనలు చోటు చేసుకోవడం, కౌంటింగ్ రోజున అల్లర్లకు ఆస్కారం ఉంటుందనే సూచనల నేపథ్యంలో కార్డన్ సెర్చ్ చేపట్టినట్లు తెలిపారు. ఆయనతో పాటు పట్టణ ఎస్ఐలు ఎం.సంధ్యారాణి, ఎం.సత్యనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఏఎంసీ చైర్మన్ బాబురావు

సత్తెనపల్లి: పట్టణంలోని 31వ వార్డుకు చెందిన కౌలు రైతు వాసుపల్లి లింగారెడ్డి (62) సోమవారం పాము కాటుకు గురై మృతి చెందాడు. గేదెలకు అవసరమైన గడ్డిని వామిలో నుంచి తీస్తుండగా పాము కాటు వేసింది. హుటాహుటిన ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రెక్కాడితే కాని డొక్కాడని పేద కుటుంబం కావడంతో మట్టి ఖర్చులకు కూడా డబ్బు లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పెండెం బాబురావు మృతుడి కుటుంబ సభ్యులకు మంగళవారం రూ.7,500 నగదు అందించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో 31వ వార్డు ప్రెసిడెంట్ చెవూరి మధు, నాయకులు డాక్టర్ నిజాంపట్నం అమరేంద్ర, మార్క్, పల్లపు రోశయ్య, షేక్ జాని, కొణతం చంటిలు ఉన్నారు.

మంచికల్లులో అక్రమ మద్యం స్వాధీనం

రెంటచింతల: మండలంలోని మంచికల్లు గ్రామంలోని ఓ షాపులో 37 క్వార్టర్ల మద్యం, రూ.51,470 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎం.ఆంజనేయులు మంగళవారం తెలిపారు. గ్రామంలోకి పోలీసు వాహనం రావడం చూసి ఓ వ్యక్తి పరారు కావడంతో అనుమానం వచ్చి ఆ షాపులో సిబ్బందితో కలిసి తనిఖీ చేయగా అక్రమంగా విక్రయిస్తున్న మద్యం, నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పరారీ అయిన వ్యక్తి గురించి విచారించగా కొరటా చంద్రశేఖర్‌రావుగా తెలిసిందని ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పశువుల్లో సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

పశువైద్యాధికారి కె.వెంకటేశ్వర్లు





పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మాచవరం: తొలకరి వర్షాల కారణంగా పొలాల్లో పచ్చిక బాగా వస్తుంది. పచ్చిక మేయడం వల్ల పశువుల్లో ఎక్కువగా సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయని, తక్షణ చర్యలు చేపట్టి తగు జాగ్రత్తలు పాటించాలని మాచవరం పశువైద్యాధికారి కె.వెంకటేశ్వర్లు తెలియజేస్తున్నారు.

- పశువులు పచ్చిక మేసే సమయంలో వర్షాల కారణంగా నేల మెత్తగా ఉండడంతో గడ్డితో పాటు మట్టిని తినడం వల్ల జీర్ణకోశ వ్యాధులు అధికంగా వస్తుంటాయి. కడుపులో నొప్పి, తీవ్రమైన జ్వరం, మేత సరిగా మేయకపోవడం లాంటి సమస్యలు ఏర్పడతాయి.
- అలాగే వర్షాల కారణంగా నేలలు చిత్తడిగా మారి గాలికుంటు వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. ఆవులు, గేదెల్లో గొంతువాపు, జబ్బవాపు, డయేరియా(అధిక విరోచనం) సోకుతాయి.
- మేకలు, గొర్రెల్లో చిటుకు రోగం, అమ్మతల్లి (షీప్ పాక్స్) రోగం, పీపీఆర్ డయేరియా, గొంతువాపు వ్యాధులు కలుగుతాయి.
- ప్రధానంగా పశువుల్లో పొలాల్లో మురుగునీరు తాగడం వలన వ్యాధులు సోకుతాయి. అంతేకాక ఫంగస్ సోకిన ఎండు గడ్డిని మేయడం వల్ల జీర్ణకోశ వ్యాధులు వస్తాయి.
- పశుపోషణ చేసే రైతులు తగు జాగ్రత్తలు పాటించి పశువులను కాపాడుకోవచ్చు. సీజనల్ వ్యాధులు సోకిన పశువులను గుర్తించి నిర్లక్ష్యం చేయకుండా పశువైద్యాధికారిని సంప్రదించి తగు చికిత్సలు చేయించాలని సూచించారు.
- తొలకరి ఆరంభంలోనే పశువులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. జీర్ణకోశ వ్యాధులు సోకినట్లయితే హెచ్ఎస్(హిమరేజ్ సిప్టిసిమియా) ఇంజక్షన్లు వేయాలి. జీవాల్లో నట్టల నివారణకు ప్రతి 15 రోజులకు ఒకసారి నికోస్లమైడ్+ఆల్బెండజోల్ 15 సీసీ ఇవ్వాలి.
- గొంతువాపు నివారణకు... పశువుల దొడ్డి క్రిమి సంహారక మందులతో శుభ్రం చేయాలి. వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. వ్యాధి తీవ్రతను బట్టి సల్ఫాడిమిడిన్, ఇంటాసెఫ్ టాజు, ఎక్సెఫ్ట్ ఇంజక్షన్లు ఇవ్వాలి. ఇతర పశువులకు సోకకుండా చూసుకోవాలి.
- గాలికుంటు నివారణకు... నోటిలోని పుండ్లకు బోరిక్‌పొడర్, గ్లిసరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పర్మాంగనేట్ ద్రావణంతో శుభ్రం చేసి వేపనూనె రాయాలి. యాంటిబయాటిక్, పెయిన్ కిల్లర్లు బిస్సేపెన్ 2.5గ్రా, ఎన్‌రోఫ్లాక్సిన్ 50 ఎం.ఎల్, సెఫ్‌ట్రిక్సిన్ 3గ్రా, మెలోనెక్స్ 30 మి.లీ, నిమోవెట్ 50 మి.లీ వాడితే పశువులు త్వరగా కోలుకుంటాయి.
- జబ్బవాపు నివారణకు... ముందస్తుగా పెన్సిలిన్ యాంటిబయాటిక్ మందులు వాడాలి. జబ్బవాపు రాకుండా టీకాలు తప్పని సరిగా వేయించాలి. చనిపోయిన పశువులను భూమిలో పాతి పెట్టాలి.
- గొర్రెల్లో నీలి నాలుక వ్యాధి... దోమకాటు, వైరస్ వల్ల గొర్రెలకు, మేకలకు ఈ వ్యాధి వర్షాకాలంలో వస్తుంది. దీన్నే మూతి వాపు వ్యాధి అని కూడా అంటారు. నివారణకు నోటి పుండ్లకు ఒక శాతం బోరిక్ యాసిడ్ లోషన్‌తో శుభ్రం చేయాలి. యాంటిబయాటిక్ ఇంజక్షన్లు ఇవ్వాలి. ఆహారంగా రాగిజావ, అంబలి జావ అందించాలి. జోరీగలు, పిడుదులు, గోమార్లు రాకుండా చూసుకోవాలి. వరిపొట్టు, ఎండిన వేపాకులతో రాత్రి వేళల్లో పొగ వేస్తే దోమలు రావు.
- కాలిపుండు వ్యాధి... వర్షాలతో నేలలు చిత్తడిగా మారడంతో బ్యాక్టీరియా వలన గిట్టల మధ్య చర్మం మెత్తబడి, వాచి చిట్లుతుంది. చీము పట్టి గిట్టలు ఊడిపోయే అవకాశం ఉంటుంది. నివారణకు 10 శాతం మైలతుత్తం, పది శాతం జింక్‌సల్ఫేట్ లేదా 5 శాతం ఫార్మలిన్ పూయాలి. యాంటిబయాటిక్‌లు కనీసం మూడు రోజులు వాడాలి.
- గొర్రెల్లో చిటుకు రోగం... ఇది చాలా ప్రమాదకరమైనది. వ్యాధి సోకిన గంటల్లోనే జీవాలు చనిపోతాయి. నోటి వెంట నురగలు కక్కడం, ఎగిరి పడడం, కనుగుడ్లు తిప్పడం, పండ్లు కొరకడం దీని లక్షణాలు. వ్యాధి సోకితే చికిత్స చేయించినా ఫలితం ఉండదు. అందుకని ముందస్తుగా ఏప్రిల్, మే నెలల్లోనే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. యాంటిబయాటిక్ మందులు తప్పనిసరిగా వాడుకోవాలి. గోమార్లు, పిడుదులు, జోరీగలు, ఇతర క్రిములు రాకుండా పశువుల కొట్టంలో పురుగు మందులు పిచికారీ చేసి, పశువులను బ్యుటాక్స్ మందుతో స్ప్రే చేసి వెంటనే కడగాలి. ఈ విధమైన ముందస్తు చర్యలు తీసుకోవడం వలన పశువుల్లో వచ్చే వ్యాధులను నివారించడంతో పాటు, పశు సంపదను కాపాడుకోవచ్చని తెలియజేశారు.

బలిజేపల్లిలో పోలీసుల తనిఖీలు



రాజుపాలెం: ఓట్ల లెక్కింపు సమయం దగ్గరపడే కొద్దీ పోలీసులలో టెన్షన్ వాతావరణం నెలకొంది. మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలలో జోరుగా తనిఖీలు చేపట్టారు. అనుమానితులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఫ్యాక్షన్ గ్రామమైన బలిజేపల్లిలో పోలీసు అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. ప్రతి గృహాన్ని జల్లెడ పట్టారు. గేదెల కొట్టాలు, గడ్డి వాములలోను విస్తృతంగా తనిఖీలు చేశారు. ఎలాంటి మారణాయుధాలు గానీ, మందు సామాగ్రి గానీ దొరకలేదు. ఎస్ఐ షమీర్ బాషా గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇతర గ్రామస్తులు గ్రామంలో అనుమానంగా సంచరిస్తే పోలీసు వారికి తెలియజేయాలని చెప్పారు. గ్రామంలో అల్లర్లు జరగకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.